క్లుప్తంగా

పేదల పెన్నిధి వైఎస్ రాజారెడ్డి



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న బైజుబాబు

కర్నూలు(హాస్పిటల్): బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి వైఎస్ రాజారెడ్డి ఎంతో కృషి చేశారని, ఆయన పేదల పాలిట పెన్నిధి అని వైఎస్ రాజారెడ్డి ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.ఎస్.బైజుబాబు అన్నారు. శుక్రవారం స్థానిక ఐటీసీ ఎదురుగా ఉన్న స్వామినగర్‌లో వైఎస్ రాజారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాజారెడ్డి 27వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని మానసిక రోగులు, కుష్టు వ్యాధిగ్రస్తులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కిశోర్, రవిగౌడ్, వెంకటేష్, దాదా పీర, రంగ పాల్గొన్నారు.

ముగిసిన బ్లూ కప్ ఫుట్‌బాల్ పోటీలు



విజేత జట్టుకు కప్ అందిస్తున్న ఫుట్‌బాల్ సంఘం ప్రతినిధులు

కర్నూలు (టౌన్): స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న బ్లూ కప్ ఫుట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలు శుక్రవారం సాయంత్రం ముగిశాయి. ఆరు జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. ఫైనల్ పోటీలో లక్ష్య టీమ్ 1-0 గోల్‌తో విజేతగా నిలిచింది. విజేతగా నిలిచిన జట్టుకు ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు, విజయ్ కుమార్ కోచ్ బ్రహ్మకుమార్ కప్ అందజేశారు.

లలితా సుందరేశ్వర స్వామి కల్యాణోత్సవం



కళ్యాణమూర్తులుగా స్వామివారు

కర్నూలు కల్చరల్: కర్నూలు ఓల్డ్‌సిటీ లలితా పీఠంలో శుక్రవారం లలితా సుందరేశ్వర స్వామి వార్ల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. లలితా సుందరేశ్వరస్వామి దశమ ప్రతిష్ఠాపన వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవ మూర్తులు, మూల విరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించారు. స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం శ్రీలలితా సుందరేశ్వరస్వామి వార్ల కల్యాణ మహోత్సవం, రథోత్సవం, మహా అన్న ప్రసాదం కార్యక్రమాలు జరిగాయి. మహిళల కోలాటం, భజనలు, నృత్యాలు అలరించాయి. లలిత పీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రహ్మణ్య స్వామి సందేశం ఇచ్చారు.

కుట్టు శిక్షణ కేంద్రం తనిఖీ

కల్లూరు: ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కల్లూరులో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. భవనంలో ఇస్తున్న శిక్షణ గురించి అక్కడి మహిళలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో శిక్షణ పొందుతున్న మహిళలకు అందిస్తున్న మౌలిక వసతులను, సదుపాయాలను పరిశీలించారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



బండను లాగుతున్న వృషభాలు

ఓర్వకల్లు: మండలంలోని లొద్దిపల్లె గ్రామంలో శుక్రవారం నిర్వహించిన జాతీయ స్థాయి పోటీలు హోరాహోరీగా సాగాయి. హనుమజ్జయంతి సందర్భంగా రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో మొత్తం 13 జతల ఎద్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీలలో నాగర్‌కర్నూలు జిల్లా, లింగాల మండలం, రాయవరం అక్షరారెడ్డి వృషభాలు తొలి బహుమతి రూ.60 వేలను కైవసం చేసుకోగా, కర్నూలు మండలం, బి.తాండ్రపాడు గ్రామానికి చెందిన ఆకెపోగు చిన్నరత్నం వృషభాలు రెండవ బహుమతి రూ.40 వేలను దక్కించుకున్నాయి. కోడుమూరు మండలం, వెంకటగిరికి చెందిన శశాంక్, శ్రేయ వృషభాలు మూడవ బహుమతి రూ.30 వేలు, గద్వాల జిల్లా, ఉండవల్లి మండలం, కంచుపాడుకు చెందిన అంజిరెడ్డి వృషభాలు నాల్గవ బహుమతి రూ.20 వేలను సాధించుకున్నాయి. బనగానపల్లె మండలం, రామతీర్థం నాగపుల్లయ్య, నంద్యాల జిల్లా, దొర్నిపాడుకు చెందిన కిట్టన్న (విడి జత) వృషభాలు ఐదవ బహుమతి 15 వేలు, కర్నూలు మండలం, పసుపుల శేఖర్, నంద్యాల జిల్లా, కొణిదేలకు చెందిన దండు రైడర్స్(విడిజత) వృషభాలు ఆరవ బహుమతి రూ.10 వేలు, కోడుమూరు మండలం, వెంకటగిరికి చెందిన బీఎల్‌కే వృషభాలు ఆరవ బహుమతి రూ.5 వేలు గెలుచుకున్నాయి.

ఇంటిపంట.. ఆరోగ్యకర వంట





ఇంటిపై కప్పుపై కనువిందు చేస్తున్న గార్డెన్

టెర్రస్ గార్డెన్‌తో అందం, ఆనందం



ఈ చిత్రంలో కనిపించే మహిళ పేరు వాణిరెడ్డి. డోన్ పట్టణంలో ఇంటిపైన ఆకుకూరలు, పూల మొక్కలతో పాటు అనేక ఆక్సిజన్ ప్లాంట్స్‌తో టెర్రస్ గార్డెన్ అభివృద్ధి చేసుకున్నారు. మందారంలోనే దాదాపు 35 రకాల మొక్కలు పెంచారు. ఈమె చేపట్టిన టెర్రస్ గార్డెన్‌లో మల్లె, విరజాజి, బ్రహ్మకమలం, తదితర పూల మొక్కలు, గోధుమ గడ్డి కనువిందు చేస్తున్నాయి. అలాగే ఇంటికి అవసరమైన ఆకుకూరలు, మొక్కలు టెర్రస్ గార్డెన్‌లోనే లభించే విధంగా తోటను అభివృద్ధి చేసుకున్నారు.

- పట్టణ ప్రాంతాల్లో అభివృద్ధి చెందుతున్న టెర్రస్ గార్డెనింగ్
- కెమికల్స్ లేకుండా ఇంటిపైనే కూరగాయలు, ఆకుకూరలు, పూలతో నందనవనాలు
- కర్నూలు నగరంలోనే ఆరు వందల ఇళ్లపై తోటలు
- వానాకాలం మొదలు కావడంతో టెర్రస్ గార్డెనింగ్‌పై మరింత దృష్టి

కర్నూలు(అగ్రికల్చర్): ఇంటిపంట ఆరోగ్యానికి రక్ష అనే సూత్రాన్ని అర్బన్ ప్రాంత ప్రజలు పాటిస్తున్నారు. ఎవరికి వారు ఇంటి పంటపై ఆసక్తి చూపుతున్నారు. నేడు కూరగాయలు, ఆకుకూరల సాగులో కెమికల్స్ వినియోగం పెరిగిపోయింది. దీంతో మార్కెట్‌లో లభించే కూరగాయలను కొనాలంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కెమికల్స్‌తో పండించిన కూరగాయలు, ఆకుకూరలను వినియోగిస్తూ అనేక వ్యాధులతో సతమతం అవుతున్న వేళ పలువురు ఇంటి పంటను ఇష్టంగా అభివృద్ధి చేసుకుంటూ కెమికల్స్ లేని కూరగాయలు, ఆకుకూరలు వినియోగిస్తున్నారు. ప్రధానంగా కర్నూలులో ఇంటి పంట గణనీయంగా పెరుగుతోంది. నగరంలో దాదాపు 600 కుటుంబాలు ఇంటి తోటలలో విశేషంగా రాణిస్తున్నాయి. డోన్, నంద్యాల, ఆదోని, బనగానపల్లి, ఎమ్మిగనూరు వంటి పట్టణాల్లో దాదాపు 2000కిపైగా కుటుంబాలు టెర్రస్ గార్డెన్, ఇంటి పంట, పెరటితోటలు అభివృద్ధి చేసుకొని ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్నారు. నగరాలు, పట్టణాల్లో పెరటితోటల అభివృద్ధికి స్థలాల కొరత ఉంటోంది. దీంతో ఇంటి పైఅంతస్తుపై పచ్చదనం అభివృద్ధి చేసుకుంటున్నారు. ప్లాస్టిక్ టబ్బులు, పాత బకెట్లు, సిమెంటు తొట్లు, ప్లాస్టిక్ సంచులు తదితర వాటితో టెర్రస్ గార్డెన్ అభివృద్ధి చేసుకుంటుండటం విశేషం. ఎండాకాలం పూర్తయి వానలు పడుతుండటంతో టెర్రస్ గార్డెనింగ్‌పై మరింత దృష్టి సారించనున్నారు.

టెర్రస్ గార్డెన్‌లో మహిళల పాత్ర కీలకం

అతివల చొరవ, పట్టుదలతోనే ఇళ్ల పైకప్పులు నందన వనాలుగా మారుతున్నాయి. మహిళలకు టెర్రస్ గార్డెన్‌ల అభివృద్ధి, వాటిల్లో పని చేయడం, నీళ్లు కట్టడం వంటి పనులు హాబీగా మారాయి. ఉదయం గంటన్నర, సాయంత్రం గంటన్నర సమయం పాటు టెర్రస్ గార్డెన్‌లో పని చేయడం వల్ల శరీరానికి తగిన వ్యాయామం లభిస్తోంది. తాజా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు వినియోగిస్తూ ఆరోగ్య సంరక్షణకు పెద్దపీట వేస్తున్నారు. స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యవంతమైన కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు వినియోగిస్తున్నారు. మొక్కలకు వర్మీకంపోస్ట్, చెరువు మట్టి, వేపచెక్క, వేపకషాయం వంటి వాటిని వినియోగిస్తారు. చీడపీడలను వేప ఉత్పత్తులతో నివారించుకుంటారు.

వాట్సాప్ గ్రూపుల సహకారం

టెర్రస్ గార్డెన్ అభివృద్ధిని ప్రోత్సహించేందుకు ప్రత్యేక వాట్సాప్ గ్రూపులు ఉండటం విశేషం. పూలు, కూరగాయలు, పండ్ల మొక్కల్లో బాగా పండిన వాటి సమాచారాన్ని గ్రూపుల్లో పోస్టు చేస్తూ, ఒకరి అనుభవాలు మరొకరు పంచుకుంటూ ముందుకు సాగుతున్నారు. సమష్టిగా మొక్కలు తెప్పించుకొని గార్డెన్‌లను తయారు చేసుకుంటున్నారు. కర్నూలు టెర్రస్ గార్డెనర్స్ వాట్సాప్ గ్రూపు, సిటీ టెర్రస్ గార్డెనర్స్ గ్రూపులు ప్రాచుర్యంలో ఉన్నాయి. ప్రతి నెలా లేదా 2 నెలలకోసారి వాట్సాప్ గ్రూపుల్లో సభ్యులుగా ఉన్నవారందరూ సమావేశమై టెర్రస్ గార్డెన్ అభివృద్ధి, కొత్త మొక్కలు తెప్పించడం, మొక్కలకు సోకే చీడలు, పీడలు, వాటి నివారణ తదితర వాటిపై చర్చిస్తారు.



ఇంటిపైన పండించిన తాజా కూరగాయలు

రకరకాల మొక్కలతో నందనవనాలు

ఎపుడు వినని, చూడని రకాల మొక్కలు టెర్రస్ గార్డెన్‌లలో కనువిందు చేస్తున్నాయి. అలాగే మల్లె, మందారం, గులాబీల్లో పదుల సంఖ్యలో రకాలు, రణపాల, అశ్వగంధ, నూరువరహాలు, స్టార్‌ఫ్రూట్స్, మల్బరీ ఫ్రూట్స్, అంజూరు, డ్రాగన్ ఫ్రూట్స్, ఆడినియం ఇలా వందల రకాలతో టెర్రస్ గార్డెన్‌లు సాకారం అవుతున్నాయి.

దశాబ్ద కాలంగా టెర్రస్ గార్డెన్‌లో రాణిస్తున్నాం



ఈ చిత్రంలో కనిపించే దంపతులు రాఘవేంద్ర, భానుమతి. కర్నూలు కృష్ణానగర్‌లో నివాసం ఉంటున్నారు. ఏడేళ్లుగా ఇంటిపై 1600 చదరపు అడుగుల విస్తీర్ణంలో అనేక రకాల మొక్కలతో నందనవనాన్ని అభివృద్ధి చేసుకున్నారు. 200 తొట్లతో పాటు బ్యాగులు తదితర వాటిని మొక్కలకు వినియోగిస్తున్నారు. సీతాఫలం, అంజూర, మల్బరీ, ఉసిరి, జామ వంటి వాటితో పాటు అన్ని రకాల కూరగాయలు, ఆకుకూరలు, పూల మొక్కలు నాటుకొని టెర్రస్ గార్డెన్ అభివృద్ధి చేసుకున్నారు. 100 రకాల మొక్కలతో గార్డెన్ కనువిందు చేస్తోంది.

– భానుమతి, రాఘవేంద్ర దంపతులు, కృష్ణానగర్

ప్రభుత్వ నిర్ణయంతో జీవనోపాధి దూరం



కాటసాని రాంభూపాల్‌రెడ్డికి వినతిపత్రమిస్తున్న ఎండీయూ ఆపరేటర్లు

కల్లూరు: ఇంటింటికీ రేషన్ పంపిణీ వ్యవస్థను కూటమి ప్రభుత్వం రద్దు చేయడం వల్ల ఆపరేటర్లు, హెల్పర్లు జీవనోపాధి కోల్పోతారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు గ్రామీణ, అర్బన్ ప్రాంతాలకు చెందిన ఎండీయూ ఆపరేటర్లు కాటసాని రాంభూపాల్‌రెడ్డిని ఆయన స్వగృహంలో కలిశారు. తమ పోరాటానికి మద్దతు తెలపాలని, తమకు అండగా నిలవాలని కోరారు. కాటసాని మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు ఇంటి ముంగిటకే రేషన్ సరుకులు అందించాలని ఉద్దేశంతో ఎండీయూ వాహనాలు తీసుకువచ్చిందన్నారు. ఈ వ్యవస్థను ఏర్పాటు చేసి రాష్ట్రంలో ఎంతో మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించిందన్నారు. దీనిని ప్రభుత్వం రద్దు చేయడం సరైందికాదన్నారు.

బీచ్ సెపక్‌తక్రాలో కాంస్యం



కాంస్య పతకం సాధించిన సెపక్‌తక్రా మహిళల జట్టు

కర్నూలు (టౌన్): కేంద్ర పాలిత ప్రాంతమైన డయ్యూలో నిర్వహించిన ఖేలో ఇండియా బీచ్ సెపక్‌తక్రా మహిళల డబుల్స్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ బాలికల జట్టు కాంస్య పతకం సాధించింది. తొలి రౌండ్‌లో గుజరాత్‌పై 2-0 స్కోర్‌తో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. తర్వాత ఢిల్లీతో తలపడి 2-0 స్కోర్‌తో విజయం సాధించి సెమీ ఫైనల్‌కు చేరుకుంది. ఒరిస్సా మహిళల జట్టుపై పోరాడి మూడవ స్థానంలో నిలిచి కాంస్యం గెలుచుకుందని సెపక్ తక్రా అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జి.శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పతకం సాధించిన వారిలో కర్నూలుకు చెందిన అపర్ణ, కడపకు చెందిన హరికారెడ్డి, ప్రకాశం జిల్లాకు చెందిన శివానీ ఉన్నారు.

ఉచిత యోగా తరగతులు



యోగాసనాలు వేస్తున్న క్లస్టర్ యూనివర్సిటీ వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

కర్నూలు సిటీ: అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల మేరకు యోగాంధ్ర-25 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని సిల్వర్ జూబ్లీ డిగ్రీ కాలేజీలో ఉచిత యోగా తరగతులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ డాక్టర్ వి.వెంకట బసవరావు ముఖ్య అతిథిగా పాల్గొని ఉచిత యోగా తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి రోజు యోగా చేయడం ద్వారా ఆరోగ్యకరంగా ఉంటారన్నారు. ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు ఆరోగ్యాన్ని మెరుగు పరుచుకునేందుకు యోగా చక్కగా ఉపయోగపడుతుందన్నారు. క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు, సిల్వర్ జూబ్లీ కాలేజీ అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకుల ఎస్టీ అంశంపై ప్రధానితో చర్చించాలి



మాట్లాడుతున్న సుభాష్ చంద్రబోస్

కర్నూలు(అర్బన్): వాల్మీకి/ బోయల ఎస్టీ రిజర్వేషన్ అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధానమంత్రి నరేంద్రమోదీతో చర్చించాలని వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్ కోరారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు వాల్మీకి బోయల ఎస్టీ రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందేలా ప్రధానమంత్రి మోదీని ఒప్పించాలన్నారు. ప్రతి ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే వాల్మీకులను ఎస్టీలుగా గుర్తిస్తామని హామీలు ఇస్తున్న చంద్రబాబుకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా, కేంద్రంతో మాట్లాడి వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ హోదా కల్పించాలన్నారు. వాల్మీకులకు ఇచ్చిన హామీని నెరవేర్చకుండా విస్మరిస్తే వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఉద్యమ కార్యాచరణను రూపొందించేందుకు త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వీఆర్‌పీఎస్ ముఖ్య నేతలతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఎస్టీ రిజర్వేషన్ సాధన కోసం వాల్మీకులంతా వీఆర్‌పీఎస్ చేపట్టనున్న ఉద్యమంలో కలిసి రావాలని సుభాష్ పిలుపునిచ్చారు.

ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకోండి




సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు టీవీ రమేష్ బాబు

కర్నూలు(రూరల్): గ్రామాల్లో అర్హులైన పేదలు ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకోవాలని కర్నూలు రూరల్ తహసీల్దారు టీవీ రమేష్‌బాబు తెలిపారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో వీఆర్వోల తో సమావేశమై మాట్లాడారు. జూన్ 1 నుంచి రేషన్ దుకాణాల నుంచి నిత్యావసర సరుకుల పంపిణీ జరుగుతుందన్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షించాలని గ్రామ అధికారులకు సూచించారు. అలాగే మండలంలో ఎవరైనా అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో ఇళ్లను నిర్మించుకుంటే క్రమబద్ధీకరిస్తున్నట్లు చెప్పారు. మండల పరిధిలోని 9 గ్రామాల్లో కేసీ నీటిని వినియోగించుకునే రైతుల నుంచి పన్నులు వసూళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు.

నేడు నగరంలో విద్యుత్ కోతలు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు విద్యుత్ శాఖ క్యాంప్స్ సెక్షన్ పరిధిలో 11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనులు చేపడుతున్నందున శనివారం విద్యుత్ సరఫరాకు అంతరా యం కలుగుతుందని కర్నూలు అర్బన్ ఈఈ టీ.శేషాద్రి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. డీఐజీ బంగ్లా, మహాలక్ష్మి నగర్, సోమప్ప కాలనీ, డాక్టర్స్ కాలనీ, అరోరా నగర్, బి.క్యాంపు, హౌసింగ్ బోర్డు కాలనీ తదితర కాలనీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వెల్లడించారు.

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట



శిలా ఫలకాన్ని అవిష్కరించిన మంత్రి టీజీ భరత్

కర్నూలు (టౌన్): నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద పీట వేస్తున్నామని మంత్రి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం కర్నూలు నియోజకవర్గం పరిధిలోని 19 వార్డుల్లో రూ.12.28 కోట్ల వ్యయంతో 31 అభివృద్ధి పనులకు మంత్రి, కమిషనర్ రవీంద్రబాబుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నగరంలో ప్రధానంగా రహదారులు, డ్రైనేజీలు, వీధి దీపాలు, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలన్నారు. బళ్లారి చౌరస్తాలో ట్రాఫిక్ నియంత్రణకు ఎస్‌ఏపీ క్యాంపు మీదుగా రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ పార్కును రూ.2,700 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని, జూన్ 2 నుంచి ఓర్వకల్లు నుంచి విజయవాడకు విమాన సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. కమిషనర్ రవీంద్రబాబు మాట్లాడుతూ.. నగరపాలక సాధారణ నిధులతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌పై 1972కు సమాచారం ఇవ్వండి



అవగాహన పోస్టర్లను ప్రదర్శిస్తున్న ఈగల్, జ్యోతి డిపార్ట్‌మెంటల్ స్టోర్స్ సిబ్బంది

కర్నూలు: మాదక ద్రవ్యాలపై ఈగల్ టోల్‌ఫ్రీ నంబర్ 1972కు సమాచారమివ్వాలని ఈగల్ ఎస్ఐ సుజన్ కుమార్ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కర్నూలు నగరం జ్యోతి డిపార్ట్‌మెంటల్ స్టోర్‌లో పనిచేస్తున్న సిబ్బందికి శుక్రవారం డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాదక ద్రవ్యాలకు బానిసలై జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కర్నూలు ప్రాంతంలో గంజాయి బెడద ఎక్కువగా ఉందని, గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. గంజాయి పండించినా, విక్రయించినా, సేవించినా, రవాణా చేసినా, దిగుమతి చేసినా శిక్షార్హులని స్పష్టం చేశారు. కష్టపడి సంపాదించుకున్న డబ్బును కుటుంబం అభివృద్ధికి, పిల్లల చదువులకు వినియోగించుకోవాలని సూచించారు. 'నేను డ్రగ్స్‌ను వాడను, కుటుంబం కోసం ఆరోగ్యంగా ఉండేందుకు నిర్ణయం తీసుకుంటున్నాను' అంటూ జ్యోతి డిపార్ట్‌మెంటల్ స్టోర్స్ సిబ్బంది చేత ప్రమాణం చేయించారు.

మండలానికి చేరిన విద్యార్థి కిట్లు

పాణ్యం : 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లు మండలానికి వచ్చాయి. వాటిని శుక్రవారం ఎంఈఓ-2 సుబ్రహ్మణ్యం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 46 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయన్నారు. వీరికి పాఠ్యపుస్తకాలు, బ్యాగ్,షూ, నోట్ పుస్తకాలు, బెల్ట్, యూనిఫామ్‌లు అందించాల్సి ఉందన్నారు. అయితే ప్రస్తుతం పాఠ్య పుస్తకాలు 21,913 రాగా ఇంకా 11,000 రావాల్సి ఉందన్నారు. బ్యాగ్‌లు 4,580 వచ్చాయన్నారు. అలాగే నోట్ పుస్తకాలు ఇప్పటి వరకు 30,718 వచ్చినట్లు తెలిపారు. యూనిఫాంలు 4,580 రావాల్సి ఉందని తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల తనిఖీ



సమయం దాటడంతో మద్యం షాపును మూయించిన డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్

కర్నూలు: మద్యం వ్యాపారులు సమయపాలన పాటిస్తున్నారా? లేదా అనే విషయంపై ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. దుకాణాల వద్ద శుభ్రత పాటిస్తూ, నిర్దేశించిన వేళల్లో మాత్రమే అమ్మకాలు జరుపుకోవాలని తనిఖీ అధికారులు వ్యాపారులకు సూచించారు. ఎక్సైజ్ నోడల్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి, అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు, సీఐలు జయరాం నాయుడు, రాజేంద్రప్రసాద్, ఎస్ఐ దుర్గా నవీన్ బాబు తమ సిబ్బందితో కర్నూలు నగరంలో విస్తృత తనిఖీ నిర్వహించారు. నగరమంతా కలియదిరిగి నిర్దేశించిన సమయానికి మద్యం షాపులను మూయించారు. ఇకపై సమయపాలన పర్యవేక్షణ కోసం ప్రత్యేక బృందం గస్తీ నిర్వహిస్తుందని సీఐ చంద్రహాస్ తెలిపారు.

ఎక్కువ సేపు కూర్చొని పనిచేస్తే వ్యాధులు



ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది, చిత్రంలో డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ

కర్నూలు(హాస్పిటల్): శారీరక వ్యాయామం లేకుండా ఒకేచోట ఎక్కువసేపు కూర్చొని పనిచేస్తే వ్యాధులు దరిచేరతాయని డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ చెప్పారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ మాట్లాడుతూ.. జీవనశైలి, ఆహార మార్పులతో ఎక్కువ మంది అనారోగ్యం బారిన పడుతున్నారని తెలిపారు. రక్తపోటు, షుగర్, క్యాన్సర్‌తో పాటు ఇతర వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చని చెప్పారు. ఆహార పద్ధతి, శ్రమాధారిత జీవనశైలితోనే మన పూర్వీకులు పూర్తి ఆరోగ్యంగా ఉండేవారని తెలిపారు. ఆహార నియమాలు పాటిస్తూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, ఆహారంలో ఉప్పు తగ్గించుకోవాలని, పచ్చళ్లు, నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను తగ్గించాలని చెప్పారు. కార్యాలయ సిబ్బంది ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 18 సంవత్సరాలు పైబడిన వారందరూ రక్తపోటు, మధుమేహం వంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఎన్‌సీడీ అధికారి డాక్టర్ శైలేష్‌కుమార్, సంచార చికిత్స కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ రఘు, కార్యాలయ పరిపాలనాధికారి అరుణ, డెమో శ్రీనివాసులు, ఆర్‌బీఎస్‌కే కన్సల్టెంట్ మల్లికార్జున, సత్యనారాయణ, ఎన్‌సీడీ ఫైనాన్స్ కన్సల్టెంట్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నపిల్లల విభాగంలో సేవలు మెరుగుపడాలి



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల చిన్నపిల్లల విభాగంలో సేవలు మరింత మెరుగుపడాలని సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు సూచించారు. ఆయన శుక్రవారం తన చాంబర్‌లో ఎన్‌హెచ్‌ఎం ఎగ్జిక్యూటివ్ కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు టెలిమెడిసిన్ ద్వారా ఆసుపత్రుల్లో ఉన్న ఎస్ఎన్‌సీయూ, డైస్‌లలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బందికి సంబంధించిన జీతాల వివరాలను పీడియాట్రిక్స్ హెచ్ఓడీ, సీఎస్ఆర్ఎంఓ పరిశీలించి వారి సేవలను ధ్రువీకరించిన తర్వాతనే డీఎంహెచ్ఓకు బిల్ ప్రాసెస్ చేయాలన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, పీడియాట్రిక్ హెచ్ఓడీ డాక్టర్ విజయానందబాబు, వైద్యులు రవీంద్రనాథ్‌రెడ్డి, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఓడీఎస్‌కు గురైన బాలికకు మెరుగైన వైద్యం

కర్నూలు(హాస్పిటల్): మల్టీ ఆర్గాన్ డిస్‌ఫంక్షన్ సిండ్రోమ్(ఎంఓడీఎస్)కు గురైన బాలికకు మెరుగైన వై ద్యం అందించిన ప్రాణంపోసినట్లు కర్నూలులోని కిమ్స్ కడల్స్ హాస్పిటల్‌కు చెందిన పీడియాట్రిషన్ డాక్టర్ నవీన్‌రెడ్డి చెప్పారు. ఆయన శుక్రవారం చికిత్స వివరాలు వెల్లడించారు.అనంతపురం జిల్లా గుంతకల్లు ప్రాంతానికి చెందిన 14ఏళ్ల బాలికకు ముందుగా జ్వర ం, దగ్గు, కడుపునొప్పి మొదలయ్యాయని, రెండోరోజే ఆమె పరిస్థితి విషమించిందన్నారు. ఆమెను స్థానికంగా ఒక ఆసుపత్రికి తీసుకెళ్లగా బీపీ(60/30) పూర్తిగా పడిపోయిందని గుర్తించి అక్కడి వైద్యులు కర్నూలు కిమ్స్‌కు రెఫర్ చేశారన్నారు. బాలికను ఆసుపత్రికి తీసుకొచ్చే నాటికే బహుళ అవయవాలు విఫలమై తీవ్ర ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లిపోయిందన్నారు. ఇన్‌ఫెక్షన్ వల్ల ఇలాంటి పరిస్థితి వస్తుందని చెప్పారు. ఆ బాలికను వెంటిలేటర్‌పై ఉంచి అవసరమైన చికిత్స అందించామన్నారు. కంటిన్యూస్ కిడ్నీ రీప్లేస్‌మెంట్ థెరపీ, వైద్యచికిత్సలతో బాలిక కోలుకుందని చెప్పారు.